నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, శుక్రవారం 30 ఆగస్టు 2024 | JAGTIAL




క్రీడా పాఠశాల విద్యార్థికి ట్రాక్‌షూట్, షూస్ అందజేస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్,

# క్రీడా పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తాం

త్వరలో కోచ్‌లను నియమిస్తాం • మంత్రి పొన్నం ప్రభాకర్

కొత్తపల్లి, ఆగస్టు 29 : కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని, కోచ్‌లను నియమిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని క్రీడా పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని, ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు క్రీడా పాఠశాలలు మంజూరు కాగా అందులో ఒకటి కరీంనగర్‌కు కేటాయించామన్నారు. పలు క్రీడాంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారుల చిత్రపటాలతోపాటు వారి చరిత్రను తెలిపేవిధంగా క్రీడాపాఠశాలలో గ్యాలరీ ఏర్పాటు చేయాలని సూచించారు. కరీంనగర్ క్రీడా పాఠశాలలో ఈత కొలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, క్రీడాకారులకు అవసరమైన ఆటవస్తువులను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి కింద కూర్చొని వారికి కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం గురించి సిబ్బందిని అడిగారు. అనంతరం క్రీడాకారులకు ట్రాక్ షూట్‌తో పాటు స్పోర్ట్స్ షూ అందజేశారు. క్రీడా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన యోగా, కరాటే, జిమ్నాస్టిక్స్ ఆకట్టుకున్నాయి. ఇక్కడ కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఆర్డీవో మహేశ్వర్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ లీలాప్రసాద్ పాల్గొన్నారు.



# రైతువేదిక వద్ద యాతన

రైతు వేదిక వద్దకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ కోసం వచ్చిన రైతులు

మల్యాల, ఆగస్టు 29: రుణమాఫీ కష్టం ఇంకా వెంటాడుతూనే ఉన్నది. ఏకకాలంలో ₹2లక్షలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేయడంతో కంగుతిన్న రైతాంగం, సర్వే సైతం నత్తనడకన సాగడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ప్రస్తుతం కుటుంబ సభ్యుల ధ్రువీకరణ కోసం ప్రత్యేకంగా యాప్ ద్వారా సర్వే జరుగుతుండగా, రైతులు రైతు వేదికల వద్దకు పరుగులు తీస్తున్నారు. గంటల కొద్ది పడిగాపులు కాస్తున్నారు. వెంటనే ధ్రువీకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు. గురువారం మల్యాల మండలంలో రుణమాఫీ కాని రైతులు మల్యాల రైతు వేదిక వద్దకు తరలివచ్చారు. రేషన్‌కార్డు లేని కారణంగా రుణమాఫీ కాని రైతులు 765 మంది ఉన్నారని, అయితే రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా గ్రామాల వారీగా దరఖాస్తులను స్వీకరించి, క్రాప్‌లోన్ వేవర్ యాప్‌లో కుటుంబ సభ్యులను వెంటవెంటనే ట్యాగ్ చేస్తూ ఆథరైజేషన్‌ను చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చంద్రదీపక్ తెలిపారు. పోతారం సహకార సంఘ రుణాలను ధరూర్‌లోని కేడీసీసీబీ బ్రాంచి ద్వారా అందజేస్తున్నందున లోన్ తీసుకున్న రైతులు జగిత్యాల అర్బన్ మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



కరీంనగర్: ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

మంత్రులు స్పందించేనా?

నివారణ మార్గాలు చూపేరా?

ప్రభుత్వ దవాఖానలో రెట్టింపైన పేషెంట్లు

రెండు నెలలుగా అందని అజిత్రోమైసిన్, డైక్లో ట్యాబ్‌లెట్లు

విషజ్వరాలు ఉమ్మడి జిల్లాను వణికిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా భయపెడుతున్నాయి. పల్లె పట్నం అన్న తేడా లేకుండా ప్రతి ఇంటినీ చుట్టుముట్టాయి. ఈ పరిస్థితుల్లో ఆర్ఎంపీల నుంచి మొదలుకొని.. జిల్లా ప్రధాన దవాఖానల వరకు జ్వరపీడితులు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా పలు ప్రైవేట్ దవాఖానలు దోచుకుంటున్నాయి. ఇప్పటికే డయాగ్నోస్టిక్ కేంద్రాలు నిర్ధారణ పరీక్షల ధరలను అడ్డగోలుగా పెంచాయి. దీని వల్ల రోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ సమయంలో రోగాల నియంత్రణతోపాటు ప్రభుత్వపరంగా మెరుగైన సౌకర్యాల కల్పన, ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క మంత్రి సమీక్షించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంత తీవ్రత ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో మంత్రులు, అధికారులు ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాను

# వణికిస్తున్న జ్వరం

గతంలో ఎన్నడూ లేనంత తీవ్రత • నియంత్రణపై సమీక్ష జరపని మంత్రులు
రోగ నిర్ధారణ పేరిట దండుకుంటున్న డయాగ్నోస్టిక్ సెంటర్లు
విలవిలలాడుతున్న రోగులు

కరీంనగర్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గతంలో ఎప్పుడూ లేని విధంగా జ్వరాలు ఈ సారి ఉమ్మడి జిల్లాను వెంటాడుతున్నాయి. పక్షం రోజులుగా పట్టి పీడిస్తున్నాయి. ఓవైపు చికున్‌గున్యా, మరోవైపు వైరల్ ఫీవర్, ఇంకోవైపు డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు ఏక కాలంలో రావడంతో రోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వీటితోపాటు విపరీతమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, దగ్గు, ఉబ్బసం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. ఇవేకాకుండా శరీరంపై దురద, కళ్ల నుంచి నీళ్లు కారడం వంటి లక్షణాలతో సతమతమవుతున్నారు. రాత్రివరకు బాగానే ఉన్నా తెల్లారే సరికి తీవ్ర జ్వరం బారిన పడుతున్నారు. వైద్యశాఖాధికారుల గణాంకాల ప్రకారం చూస్తే.. పెద్దపల్లి జిల్లాలో 15,300, రాజన్న సిరిసిల్లలో 16వేలు, జగిత్యాల జిల్లాలో 18వేలు, కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా దాదాపు 49వేల మంది జ్వరం బారిన పడ్డారు. పలు జిల్లాల్లో డెంగ్యూ కేసులు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి.

## నిర్లక్ష్యం.. వాతావరణ మార్పులు

ప్రస్తుతం ఇంత జ్వర తీవ్రత పెరగడానికి వాతావరణ మార్పులతోపాటు ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్యం కారణమన్న విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా వానకాలం వచ్చిందంటే గతంలో దోమల నివారణకు అనేక చర్యలు చేపట్టేవారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి డ్రైనేజీలను క్లీన్ చేసేవారు. కాలనీల్లో చెత్తా చెదరాన్ని తొలగించేవారు. డ్రైడేలు పాటించేవారు. నిబంధనల ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునే వారు. ముఖ్యంగా సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్ చేసే వారు. కానీ, ప్రస్తుతం మెజార్టీ ప్రాంతాల్లో అవేవీ కనిపించడం లేదు. చాలా చోట్ల ఫాగింగ్ యంత్రాలు మూలన పడ్డాయి. పట్టణాల్లో ఈ సారి స్పెషల్ డ్రైవ్‌లపై ఫోకస్ తగ్గింది. పల్లెల్లో పాలకవర్గాలు లేకపోవడం, నిధులు రాకపోవడంతో ప్రత్యేకాధికారులు ఏమిచేయలేని దుస్థితి. ఇవన్నీ జ్వరాలు ప్రబలడానికి కారణమవుతున్నాయి.

## మంత్రుల సమీక్షలూ కరువే?

నిజానికి ఇంత తీవ్రత ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు ప్రతి వారం పదిరోజులకోసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. జ్వరాలు ఇంతలా ప్రబలడానికి కారణాలు అన్వేషించాలి. దవాఖానలు సందర్శించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకోవాలి. అవసరమైతే అధికారులకు ఆదేశాలు ఇచ్చి తగిన వసతులు సమకూర్చేలా చర్యలు తీసుకోవాలి. సంబంధిత అధికారులతో సమీక్షించాలి. ఏయే ప్రాంతాల్లో ఎక్కువ కేసులు నమోదు అయ్యాయో గుర్తించి నివారణ మార్గాలు చూపాలి. ఓవైపు ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన సౌకర్యాలు అందేలా చూస్తూనే.. మరోవైపు ప్రైవేట్ దవాఖానలపై కన్నేయాలి. అక్కడ జరిగే అడ్డగోలు దోపిడీ విధానాన్ని అరికట్టేందుకు అవసరమైతే ప్రతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఒక ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసి.. అది 24 గంటల పాటు రన్ అయ్యేలా చూడాలి. పేషెంట్ల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించి.. వాటిని పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలి. కానీ, ఇవేవి కనిపించడం లేదు. ఎవరైనా జిల్లా వైద్యాధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే వారు ఫోన్ ఎత్తరు. అందుకే ప్రైవేట్ డయాగ్నోస్టిక్ కేంద్రాల దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోగ నిర్ధారణ కోసం డయాగ్నోస్టిక్ సెంటర్లు.. ఇబ్బడి ముబ్బడిగా ఫీజులు పెంచాయి. దీనిపై రోగులు, పలు సంఘాల నాయకులు ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటువంటి అంశాలను సమీక్షించి.. ప్రస్తుత సంకట స్థితిలో పాత ధరలు అమలు అయ్యేలా మంత్రులు సమీక్ష సమావేశాల్లో నిర్ణయాలు తీసుకొని.. సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి. కానీ, ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు పడడం లేదు.

## రెండు నెలలుగా మందులు రాలే?

ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు కావాల్సిన అన్ని మందులున్నాయని చెబుతున్నా ప్రస్తుత సమయంలో ఉండాల్సిన రెండు రకాల అసలైన మందులు మాత్రం రెండు నెలలుగా రావడం లేదు. అందులో అజిత్రోమైసిన్, డైక్లో ట్యాబ్‌లెట్లు లేవు. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లకు, జీర్ణశాయంతర అంటు వ్యాధులు, ఊపిరితిత్తులు ఇన్ఫెక్షన్లు, కోరింత దగ్గు, వంటివాటికి అజిత్రోమైసిన్ వినియోగిస్తారు. నొప్పులకు డైక్లో ట్యాబ్‌లెట్స్ వాడుతారు. ప్రస్తుతం ఏ జ్వర పీడితున్ని చూసినా నొప్పుల తీవ్రతతో బాధపడుతున్నారు. ఈ మందులు లేవని రెండు నెలలుగా ప్రభుత్వానికి నివేదికలు వెళ్తున్నాయే తప్ప అక్కడి నుంచి మాత్రం రావడం లేదు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రధాన దవాఖానల్లో ఉన్నది.

## మంత్రులు స్పందిస్తారా? లేదా?

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. ఉమ్మడి జిల్లాకు కేవలం రెండు సార్లు మాత్రమే వచ్చారు. అందులోనూ ఆయన ఒకేఒకసారి జిల్లా అభివృద్ధిపై సమీక్ష జరిపి వెళ్లిపోయారు. అలాగే ఉమ్మడి జిల్లా మంత్రులుగా చెబుతున్న శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ కూడా ప్రస్తుత వైరల్ ఫీవర్స్‌పై సమీక్షలు పెట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా మంత్రులు స్పందించి, పెరుగుతున్న జ్వరాల తీవ్రతను గుర్తించి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అవసరముందన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తున్నది. ప్రధానంగా రోగుల్లో మనోనిబ్బరాన్ని నింపడమే కాదు, ప్రత్యక్షంగా పేషెంట్లను కలిస్తే అందుతున్న సౌకర్యాలు తెలుస్తాయి. అలాగే ప్రైవేట్ రంగంలో జరుగుతున్న దోపిడీ అరికట్టేందుకు వెంటనే ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలి. సదరు బృందం నిరంతరం తనిఖీలు చేసి, రోగుల జేబులకు చిల్లులు పడకుండా చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### నొప్పులు తగ్గుతలెవ్వు



వారం నుంచి నాకు జ్వరం వస్తుంది. పెద్దపల్లి జిల్లా దవాఖానలనే చూపిచ్చుకున్న. ఇంటికాన్నే మందులు మింగిన. మొన్నటి నుంచి కాళ్లు, చేతుల కీళ్ల మధ్య నొప్పి వస్తంది. మొన్ననే ఇక్కడికి వచ్చిన. రక్త పరీక్ష చేసిన్రు. బెడ్ ఇచ్చిన్రు. నొప్పులు తగ్గుతలెవ్వు. డాక్టర్లు మంచిగ పట్టించు కుంట లేరు. బెడ్ల పడి సచ్చుడేకానీ పట్టిచ్చుకునేటోళ్లు లేరు.

-సిలుముల లావణ్య, పెద్దపల్లి

### జిల్లాల వారీగా ప్రభుత్వ దవాఖానల్లో రెట్టింపు అవుతున్న ఓపీ పేషెంట్ల వివరాలు..

- కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో నెల కింద ఓపీ పేషెంట్ల సంఖ్య 800 నుంచి 900 వరకు ఉండేది. ప్రస్తుతం 1200 నుంచి 1300కు పెరిగింది. 300 బెడ్స్ ఉండగా ప్రస్తుతం ఇన్ పేషెంట్లు 360 మంది ఉన్నారు. ఎక్కువ ఉన్న పేషెంట్లకు అదనపు బెడ్స్ వేస్తున్నారు. అలాగే హుజూరాబాద్ ఏరియా దవాఖానకు గతంలో రోజుకు 300 నుంచి 350 మంది రాగా, ఇపుడా సంఖ్య 400 నుంచి 450కి పెరిగింది. జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గతంలో 70 నుంచి 100 మంది వచ్చేవారు కాగా, ఇపుడు 100 నుంచి 130కి చేరింది. 30 పడకలు ఉన్న ఈ సెంటర్‌లో ప్రతి రోజూ 10 నుంచి 15 మంది ఇన్ పేషెంట్లుగా ఉంటున్నారు. చొప్పదండి పీహెచ్‌సీలో గతంలో 50 నుంచి 70 మంది వరకు వచ్చేవాళ్లు. ఇపుడు ఓపీ 100 నుంచి 120కి పెరిగింది. 10 పడకలు ఉండగా, 10 మంది ఇన్ పేషెంట్లుగా ఉంటున్నారు.
- జగిత్యాల జిల్లా ప్రధాన దవాఖానలో ఓపీ గతంలో రోజుకు 400 నుంచి 450 వరకు ఉండేది. ప్రస్తుతం జ్వరపీడితుల సంఖ్య తీవ్రంగా పెరిగిపోయింది. రోజుకు సగటున 800 మందికి పైగా నమోదవుతున్నది. పెద్ద సంఖ్యలో ఇన్‌పేషెంట్లు జాయిన్ అవుతున్నారు. ప్రస్తుతం 450కి పైగా ఇన్‌పేషెంట్లు ఉన్నారు. ప్రధానంగా వైరల్ ఫీవర్స్ అధికంగా నమోదు అవుతున్నాయని చెబుతున్నారు. వాతావరణంలో మార్పులు, దోమల కారణంగా వైరల్ ఫీవర్స్ నమోదు అవుతున్నాయి. జిల్లా ప్రధాన దవాఖాన కావడం, మెడికల్ కాలేజీకి అనుబంధం కావడంతో మందులకు కొరత అంతగా లేదు.
- సిరిసిల్ల ప్రధాన దవాఖానలో పదిహేను రోజుల క్రితం 700 మంది అవుట్ పేషెంట్లు రాగా ప్రస్తుతం ఆ సంఖ్య 920కి పైగా చేరింది. 330 బెడ్స్ ఉండగా 151 ఇన్ పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. 22 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి. వేములవాడ దవాఖానకు గతంలో 400 మంది అవుట్ పేషెంట్లు రాగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 650కి పెరిగింది. వంద బెడ్స్‌గాను 82 మంది ఇన్ షేపెంట్లు చికిత్స పొందుతున్నారు.
- పెద్దపల్లి జిల్లా ప్రధాన దవాఖానకు గతంలో 400 నుంచి 500 మంది అవుట్ పేషెంట్లు రాగా, ప్రస్తుతం ఆసంఖ్య 700 నుంచి 950 వరకు పెరిగింది. గోదావరఖనిలోనూ ఇదే పరిస్థితి. అంతేకాదు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోనూ పేషెంట్ల సంఖ్య రెట్టింపైంది.

### ₹25 వేలు మాఫీ కాలే



నా భర్త దాసరి నర్సయ్య పంట పెట్టుబడి కోసం ₹25 వేల రుణం తీసుకున్నడు. అనారోగ్యంతో ఇంట్లనే ఉంటున్నడు. లోన్‌ను నా పేరు మీద తీసుకొని, రెన్యూవల్ చేసుకున్న. కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేస్తమంటే సంబురపడ్డ. కానీ నా పేరు రాలేదు. ₹25వేలు కూడా మాఫీ కాలె. ప్రభుత్వం స్పందించి నా లోన్ మాఫీ చేయాలె.

- దాసరి సోమక్క, పోరుమల్ల (మేడిపల్లి)

### షరతుల్లేకుడా మాఫీ చేయాలి..



కాంగ్రెస్ సర్కారు రైతులను ఇబ్బంది పెడుతున్నది. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు మొండిచేయి చూపుతున్నది. ఇచ్చిన మాట ప్రకారం షరతుల్లేకుండా ₹2లక్షల రుణమాఫీ చేయాలె. రైతు భరోసా కింద ఎకరానికి ఏడాదికి ₹15 వేల సాయం ఇవ్వాలి. ధాన్యానికి క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇవ్వాలి. మాటిచ్చి మోసం చేస్తే ఊరుకునేది లేదు.

- నోముల నరసింహారెడ్డి, ఉమ్మడి మేడిపల్లి రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు

### అప్పుడు షరతులు యాదికి రాలేదా?



షరతుల్లేకుండా రైతులందరికీ ₹2 లక్షల రుణమాఫీ చేయాలి. ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చేటప్పుడు షరతులు యాదికి రాలేదా..? బడ్జెట్ సరిపోదని తెల్వదా..? అమలు చేసే రోజు అచ్చేసరికి షరతులు గుర్తుకు వస్తాయా..? తక్షణమే షరతులు లేకుండా బేషరతుగా రుణమాఫీ కావాలె. దొడ్డు రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు ₹500 బోనస్ చెల్లించాలి.

- పీసు రాజేందర్‌రెడ్డి, మేడిపల్లి (మెట్‌పల్లి)



మెట్‌పల్లి: 63వ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

# మాఫీ కోసం రైతుల పోరుబాట

- మెట్‌పల్లిలో ర్యాలీ, మహాధర్నా
- మేడిపల్లిలో భారీ ఆందోళన
- షరుతుల్లేకుండా మాఫీ చేయాలి, రైతు భరోసా, వరికి బోనస్ ఇవ్వాలని డిమాండ్

మెట్‌పల్లి/ మారుతీనగర్/ మేడిపల్లి, ఆగస్టు 29 : రుణమాఫీ కోసం రైతులు గర్జించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ తీరును నిరసిస్తూ ఆందోళనకుదిగారు. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాలకు చెందిన వందలాది మంది రైతులు గురువారం మెట్‌పల్లిలో అఖిల పక్ష రైతు మహాధర్నా చేశారు. అటు మేడిపల్లి మండల కేంద్రంలోనూ ఉమ్మడి మేడిపల్లి మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా, రాస్తారోకో చేశారు. మాటిచ్చి తప్పిన సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయాచోట్ల నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ సర్కారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందంటూ రైతులు మండిపడ్డారు. ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో అర్హులైన ప్రతి రైతుకు ₹2 లక్షలు వరకు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఎకరానికి ₹7,500 పంటకు పెట్టుబడి సాయం అందించాలని, ధాన్యానికి ₹500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవుడి మీద ఒట్టు పెట్టి మాట తప్పిన చరిత్ర దేశంలో ఒక్క తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి తప్ప మరెవరికీ లేదని విమర్శించారు. రైతులతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరా, రైతులను విస్మరిస్తుందని, రాబోయే రోజుల్లో గెలిపించిన రైతులే మళ్లీ బొందపెట్టడం ఖాయమని హెచ్చరించారు.

మెట్‌పల్లిలో పట్టణంతోపాటు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల రైతులు అఖిల పక్ష రైతు మహాధర్నాకు తరలివచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా 63వ జాతీయరహదారి మీదుగా పాత బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. స్థానిక శాస్త్రీచౌక్ వద్ద రహదారిపై బైఠాయించి తమ నిరసన తెలిపారు. సర్కారు తీరును ఎండగట్టారు. సుమారు గంటన్నరపాటు మహాధర్నా చేశారు. ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు వాహనాలను మళ్లించారు. సమాచారం అందుకున్న ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు రైతుల వద్దకు చేరుకుని మాట్లాడారు. వినతి పత్రాన్ని తీసుకున్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. ఈ ఆందోళనలో అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు మామిడి నారాయణరెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, గురిజెల రాజారెడ్డి, మారు మురళీధర్‌రెడ్డి, ఎలిసే గూడ పాపన్న, యాళ్ల తిరుపతిరెడ్డి, ఆకుల ప్రవీణ్, ఒజ్జెల శ్రీనివాస్, డొనికెల నవీన్, ఏనుగు గంగారెడ్డి, కదుర్క నర్సయ్య, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేవ మల్లయ్య పాల్గొన్నారు.




మేడిపల్లి: జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు

ఉమ్మడి మేడిపల్లి మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా మేడిపల్లి మండల కేంద్రం జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేశారు. రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని రైతులు నినాదాలు చేశారు. భారీగా ట్రాఫిక్ స్తంభించిపోగా, తహసీల్దార్ వసంత, ఏఓ షాహిద్ అలీ, జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐలు శ్యామ్‌రాజ్, శ్రీకాంత్, నవీన్, శ్వేత ధర్నా వద్దకు చేరుకొని మాట్లాడారు. అధికారుల హామీ మేరకు రైతులు ధర్నాను విరమించారు. అనంతరం తహసీల్ ఆఫీస్ వద్దకు వెళ్లి తహసీల్దార్ వసంతకు, ఏఓ షాహీద్ అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ ఆందోళనలో నాయకులు క్యాతం దశరథరెడ్డి, ఎస్ఎన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గంగారెడ్డి, ఆనందంరెడ్డి, జీఎస్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ధర్మారెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

### రైతుల తడాఖా చూపిస్తాం..



ఎన్నికల ముందు మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోంది. రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం ఎక్కువ కాలం మనుగడలో ఉండదు. వెంటనే ఇచ్చిన హామీలన్నింటికీ బేషరతుగా అమలు చేయాలి. లేదంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులంటే ఏంటో తడాఖా చూపిస్తాం.

- గడ్డం తిరుపతిరెడ్డి, సిరిపూర్ (మెట్‌పల్లి)

### రైతు భరోసా ఏది?



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఇప్పటి వరకు రైతు భరోసా కింద ఎకరానికి ₹7,500 చొప్పున ఇస్తామన్న పెట్టుబడి సాయం ఊసే లేదు. వాన కాలం పంట వేసి రెండు నెలలైపోయింది. ఇంకా ఎప్పుడిస్తరో..? తెల్వదు. ఇస్తరనే గ్యారెంటీ కూడా లేదు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ముంచడం సరికాదు. ఇది కూతల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదు.

- గాజె చిన్న రాజన్న, రైతు (మెట్‌పల్లి)

### అసెంబ్లీని ముట్టడిస్తాం



షరతుల్లేకుండా ₹2 లక్షల దాకా రుణమాఫీ కావాలె. లేదంటే మెట్‌పల్లి ప్రాంత రైతులందరం రాబోయే రోజుల్లో అసెంబ్లీని ముట్టడించేందుకు వెనుకాడేది లేదు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైంది. ఇప్పటికీ రుణమాఫీ కాలేదు, ఇస్తామన్న రైతు భరోసా జాడలేదు.

- గుజ్జుల నర్సారెడ్డి, ఇబ్రహీంపట్నం (మెట్‌పల్లి)